## అన్వేషణ

- నిమిత.




రోజూలాగే ఆమె ఇవాళ కూడా బస్టాపులో మామూలుగా నుంచొని ఉంటే నాకే అనుమానమూ వచ్చుండేది కాదు. కానీ ఇవాళ నేను తలతిప్పి చూసేసరికి తను స్థంభం  చాటుకి తప్పుకోవడంతో మొదలైంది ఘర్షణ. గత వారం రోజులుగా ప్రతి సాయంత్రం ఆమెని అదే చోటులో చూస్తున్నాను. చూసిన మొదటి రోజునుండీ నేను ఆఫీసులోంచి సరిగ్గా ఐదున్నరకి బయటకి రావడం, నన్ను టెన్నిస్ క్లబ్‌కి తీసుకెళ్ళడం కోసం ఎదురు చూస్తున్న కారులో ఎక్కబోయే ముందు ఆమెని పరికించి చూడ్డం నా దినచర్యలో ఒక భాగమైంది. ఆమె పనిచేసే ఆఫీసు అక్కడికి దగ్గరలో ఉందేమో, తనూ అదే సమయానికి ఇంటికి వెళుతుందేమో అని మొదట్లో సమాధాన పడ్డాను.

ఎన్ని పనులున్నా సరిగ్గా ఐదున్నరకి క్లబ్‌కి వెళ్ళి టెన్నిస్ ఆడి, అలసిపోయిన శరీరంతో బీచిలో కూర్చుని చల్లగాలి తోడుగా, సంధ్యాకాంత సాక్షిగా సముద్రం అంచుల మీదనుంచి మళ్ళీ తిరిగి రాలేని దూరతీరాలకి తరలిపోతున్న ఇవాళ్టన్న రోజుకి వీడుకోలు చెప్తూ, ముసిరే చీకటి తెరల మధ్య కరిగిపోయే క్షణాలకి నా కలంతోనో, కుంచెతోనో ఊపిరి పొయ్యడం ఊహ తెలిసినప్పటి నుండీ నా కలవాటు. చిన్నప్పుడు స్కూలు వదలగానే నాన్న నన్నూ, అన్నయ్యనూ తీసుకొని వచ్చి ఈ అలవాటు నేర్పించడానికి ప్రయత్నించారు. అన్నయ్యకు వీటన్నింటిలో టెన్నిస్ మాత్రమే వంట బట్టింది. రాన్రానూ టెన్నిస్ క్లబ్ నుంచీ నేరుగా ఇంటికి వెళ్ళిపోయేవాడు. నాన్నతో కలిసి నేను మాత్రమే బీచికి వచ్చేదాన్ని. ఆయన నాకు ఓ పుస్తకమో, కాన్వాసో ఇచ్చి, కారు డ్రయివరుని జాగ్రత్తగా చూడమని చెప్పి తను ఏకాంతంగా గడపడానికి వెళ్ళేవారు. ఒక్కోరోజు నేను రాసుకుంటుంటేనో, పెయింటింగ్ చేస్తుంటేనో దూరంగా కూచుని గమనించేవాళ్ళు. మా ఇద్దరి మధ్యా తండ్రీ కూతుళ్ళ బంధమేదైనా ఉందంటే దానికి సాక్ష్యం ఆ సాయంత్రాలు మాత్రమే.

అలవాటు ప్రకారం తీరం వెంబడి కొంచెంసేపు నడిచివచ్చి పుస్తకం, పెన్నూ పట్టుకుని కూర్చున్నాను.. కానీ మనసు కుదరడం లేదు. ఆమెని ఇంతకు ముందెప్పుడు చూశాను? నన్ను చూసి ఇవాళ ఎందుకలా చాటుకు తప్పుకుంది? నన్ను చూసేనా లేక మరెవరినన్నా చూసి వాళ్ళకు తను అక్కడుండడం తెలియకూడదని తప్పుకొందా? అసలా అవసరం ఎందుకు? ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముడుతున్నాయి. మనస్తత్వాల్ని సహజంగానే విడమర్చి పరిశీలించే నాకు ఆమె కథేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువైంది. రేపు కనిపిస్తే తప్పకుండా వెళ్ళి మాట్లాడాలనుకొని నిర్ణయించుకున్నాను. కానీ ఆమెని అంతకుముందు ఎప్పుడు చూశానో ఆ తర్వాత రోజు వరకూ ఎదురు చూడనవసరం లేకుండానే అనుకోకుండా నాకు గుర్తుకు వచ్చింది. వ్రాయడానికి మరికొంతసేపు అస్తవ్యస్తమైన ఆలోచనలతో కుస్తీపట్టి, మీద ఒక మూలనుండి మరో మూలకు నిండిన గజిబిజి అక్షరాలు చూసి, మరిక ప్రయోజనం లేదని ఇంటి ముఖం పట్టాను.

కారు స్టీరియోలో "తేరే బినా జిందగీసే కోయీ..." కిషోర్ కుమార్ గొంతు మధురంగా మోగుతుంది. ఆ పాటంటే నాన్నకెంత ఇష్టం! ఓ సారి తనతో నన్ను కాన్ఫరెన్స్‌కి తీసుకెళ్ళినపుడు, దారిలో ఆ పాటని వరసగా పదిహేను సార్లు మైమరచి విన్నారు. " నువ్వు తప్ప నా జీవితంలో మరే సమస్యా లేదు. కానీ, నువ్వు లేకపోతే అసలు జీవితమే లేదు.." అంత అందమైన భావాన్ని రెండు లైన్లలో

చెప్పగలగటమే కవిత్వం గొప్పతనం అంటూ చెప్పారు. ఎప్పుడూ గంభీరంగా ఉండే నాన్న అలా మనసు విప్పి మాట్లాడ్డం అదే మొదటి సారి. అసలాయన ఎక్కువగా మాట్లాడ్డమే ఇంట్లో ఎవరమూ చూడలేదు. కొన్ని సార్లు ఆయన నోరు విప్పి చెపనవసరం లేకుండానే తన సమాధానం అవతల వాళ్ళకి అర్థమయ్యేది. ఆయన జీవితంలో వ్యాపార పరంగా, వ్యవహారపరంగా పరిచయమైన కొన్ని వందల మందిలో ఆయన గురించి లోతుగా అర్థం చేసుకున్న మనిషి ఒక్కరూ లేరు. అసలాయన ఎవరికీ ఆ అవకాశమే ఇవ్వలేదు. "కొండతవ్వి ఎలుకను పట్టుకోవచ్చు కానీ, మీ నాన్న మనసులో ఏముందో ఎవరూ పట్టుకోలేరు" అమ్మ పేలవమైన వాఖ్యానం గుర్తుకు వచ్చి నువ్వు వచ్చింది. ఆలోచనలు విచిత్ర మైనవి. ఒకదానికి మరొక దానికి మధ్య నిగూఢమైన బంధం ఏదో ఉంది. ఒక విషయంతో మొదలయి పరంపర కొనసాగి మరెక్కడో అంతమౌతుంది. ఇలా సంబంధంలేని ఆలోచనల మధ్య హఠాత్తుగా నాకు జ్ఞాపకం వచ్చింది, ఆమెనంతకు ముందెప్పుడు చూశానో.

"నాన్నగారు పోయారు. వెంటనే బయులుదేరు," టెలిఫోన్‌లో అన్నయ్య గొంతు. ఒక్క క్షణం ఏమీ అర్థమవలేదు. బ్రతికినన్నాళ్ళూ అపరిచితుడిగా మిగిలిపోయిన నాన్న, ఉన్నట్టుండి ఇప్పుడు లేడంటే, ఆ వార్తకి ఎలా ప్రతిస్పందించాలని నిర్ణయించడానికి నా అంతరంగానికి కొంచెం సమయం పట్టింది. అసలాయన ఉనికికీ, మా ఇద్దరి మధ్యా బంధానికి అర్థం ఏమిటా అని ఒక్క నిమిషం కూడా ఎప్పుడూ ఆగి అలోచించలేదు. ఇప్పుడు దాని గురించి తరచి చూడాల్సిన సమయం వచ్చింది. భౌతికంగా, మౌలికంగా కొద్ది క్షణాల క్రితం ఈ అనంత విశ్వంలో తనదంటూ ఒక చోటును ఆక్రమించిన వ్యక్తి కోసం నేనిప్పుడు ఎలా రోదించను? కనీసం నా దుఃఖానికి కారణం వెతుక్కోవడం కోసమైనా ఆయనెవరనేది తెలుసుకోవాలి. ఇంటికి వచ్చి పలకరించే వాళ్ళలో ఆయన గురించి నిజంగా తెలిసిన వాళ్ళెవరూ ఉండకపోవచ్చన్న శంక ఏమూలో కదలాడుతుండగా మనసు ధృఢపరచుకొని హాల్లో అడుగు పెట్టాను.

నిన్నటి వరకూ ఎంతో ఆరోగ్యంగా ఉన్న ఆయన ఉన్నట్టుండి పోవడంతో అందరికీ అయోమయంగా ఉంది. "రాయిలా ఉండే ఆయనే పోతే, మనమేం అనుకోవాలి?", ఎవరిదో వాఖ్య. వచ్చిన వారిలో కొంతమంది లాయర్లతో తమ పెట్టుబడుల గురించి, కంపెనీ వాటాల గురించి మంతనాలు చేస్తున్నారు. ఆయన న్యాయకత్వంలో సామ్రాజ్యంలాగా విస్తరించిన వ్యాపారాలన్నీ ఇప్పుడు మరో నాయకుడి క్రింద ఎంత విజయవంతమౌతాయోనన్న సందిగ్ధం, అసహనం వాళ్ళందరి మొహాల్లోనూ కనపడుతుంది. వీళ్ళందరి తంతూ ఒకటైతే, అంతరంగికుల మధ్య జరిగే ఘర్షణలు మరో వంతు. నేను గదిలో ప్రవేశించేటప్పటికి, నలభై ఏళ్ళు కలసి కాపురం చేసిన అమ్మ ఫోనులో.. అవతల లాయరనుకొంటాను, ఏ లాకరులోనూ విల్లు కనబడ్డంలేదని ఎగిరిపడుతుంది. ఆయన ఆమెని శాంత పరిచి విల్లు తెచ్చి చేతికందించిన తర్వాత, ఉన్న అన్ని వ్యాపారాల్లోనూ లాభసాటిదైన టెక్స్‌టైల్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్ నా పేరున ఉండటంతో అన్నయ్య పేచీ పెట్టాడు. ఇవన్నీ దగ్గరగా చూశాక, నేను నాకు అర్థం కాని ఎండమావుల్లాంటి అరూప చిత్రాల వెనుక పరుగు తీస్తున్నానేమో అనిపించింది. నాకు తెలుసు అమ్మదీ, నాన్నదీ ఆదర్శ దాంపత్యం కాదన్న విషయం. వాళ్ళిద్దరూ ఆనందంగా కలసి నవ్వడం నేనెప్పుడూ చూడలేదు. ఉత్తర, దక్షిణ ధృవాల్లాంటి మనుషుల మధ్య ఆకర్షణ ఉంటుందంటారు. ఆ ఆకర్షణ దూరంగా ఉన్నంత సేపేనేమో. ఆ ఇద్దరినీ దగ్గరగా తేస్తే వాళ్ళిద్దరి మధ్యా ఉన్న తేడాలు వాళ్ళ మీద ఎలాంటి ప్రభావం చూపెడతాయో ఏ మానసిక శాస్త్రవేత్తకీ అర్థం కాదేమో. చిన్నప్పటి నుండీ వాళ్ళిద్దరి మధ్యా ముభావం చూసి నాకు పెళ్ళంటేనే విరక్తి వచ్చింది. అలాగని వాళ్ళిద్దరూ ఎప్పుడూ పోట్లాడు కోవడం కానీ, అరచు కోవడం కానీ నేను చూళ్ళేదు. కనీసం అలా ఉన్నా వాళ్ళిద్దరి మధ్యా పోట్లాడు కొనేంత స్వతంత్రం ఉందనుకోవచ్చు. కానీ ఆ ఇంట్లో ఒకరి అస్థిత్వం మరొకరికి అంత భేధం కలిగించినట్లుగా కూడా లేని ఆ వాతావరణంలో పెరిగే కన్నా విడిపోయిన తల్లితోనో, తండ్రితోనో బ్రతకడం ఉత్తమం. అలా ఆలోచిస్తే మన సమాజంలో విడిపోవాల్సిన జంటలు ఎన్నున్నాయో. విడిపోయే ధైర్యమే ఉంటే మనసునీ, ఉనికినీ చంపుకొని బ్రతకాల్సిన

అవసరం ఇంత మందికి రాదు. ఈ విషయంలో అమ్మది లేదా నాన్నది మాత్రమే తప్పుని కూడా అంగీకరించలేను. వాళ్ళ మనస్తత్వాల్ని అర్థం చేసుకోగల మనిషి దొరికి ఉంటే, వారిరివురూ ఆనందంగా బ్రతక గలిగే వాళ్ళేమో.

ఇలా ఎవరికి వారే ఒక మనిషి ఉనికి మాయమైందన్న విషయం కూడా గుర్తులేనట్టు ప్రవర్తిస్తుంటే ఆ ప్రదేశం నుండి పారిపోవడానికి నేను తోటలో తిరుగుతున్నప్పుడు చూసానామెని. గులాబీ పొదల దగ్గర తల వంచుకుని కూర్చుని ఉంది. నా అడుగుల చప్పుడికి తలెత్తి చూసిన ఆమె కళ్ళల్లో దుఃఖం చూసి నేను కదలి పోయాను. హఠాత్తుగా నా దుఃఖానికి ఒక కారణం దొరికింది. ఆయన పోయాడన్న విషయం అంతగా గాయ పరచిందే ఈ అపరిచిత వ్యక్తిని. నాకు ఆ అవకాశం కూడా రాలేదే దుఃఖం అన్న భావం ఎంత స్వార్థపూరితమైంది? ఒక మనిషి పోతే, ఆ మనిషి లేకపోవడం వల్ల మనకు కలిగే కష్టాల్ని, బాధల్నీ, లోట్లనీ తలచుకొని ఏడుస్తాం కానీ పోయిన ఆ మనిషి కోసం, అంతమైన అతని జీవితం కోసం మాత్రమే ఎవరి కళ్ళల్లో నుండైనా ఒక చుక్క రాలుతుందా? ఇన్నాళ్ళ సాహచర్యంలో నేనూ నాన్న అడుగుజాడల్లో నడిచానేమో, నా భావాలు మరో మనిషి సమక్షంలో వ్యక్తపరచడం ఇష్టంలేక గబగబా అక్కడ నుండి వెళ్ళిపోయాను. ఆ తర్వాత ఆమెని బస్టాపులో చూశాను. ఇంతకీ ఆవిడెవరైందీ, ఇంట్లో ఉంటే ఎక్కువ సమయం అక్కడే గడిపే నాన్నకి అత్యంత ఇష్టమైన ఆ గులాబీ పొదల దగ్గర కూచొని ఏం చేస్తుంది? నాన్న పోయారని ఎందుకంత దుఃఖించింది? జవాబులేని ప్రశ్నలెన్నో. ఆవిడెవరో తెలుసుకోవడం నాకూ, నాన్నకూ ఉన్న ఒకే ఒక్క లింకేమో అని సందేహం. కానీ మరో పక్క ఇంతా చేసి ఆవిడ జాడ తెలుసుకొని, ఆమె దుఃఖానికి కారణం ఏదో చిన్నదై ఉంటే ఆయన వారసత్వంగా నన్ను తప్ప మరేం మిగల్చకుండా నాన్న వెళ్ళిపోయారన్న వాస్తవం బయల్పడుతుందేమోనన్న భయం.

ఆ తర్వాత మరో వారం రోజుల పాటు ప్రతిరోజూ ఆవిడ కోసం సాయంత్రాలు నా కళ్ళు వెదుకుతూనే ఉన్నాయి. కానీ ఆమె మళ్ళీ కనపడలేదు. నాకు అర్థంకాని, అర్థమైనా అంగీకరించడానికి మనసొప్పుకోని రహస్యమేదో నన్ను వేదన పెడుతోంది. ఆవిడ వివరాలు కనుక్కొందామంటే కనీసం ఆవిడ పేరైనా తెలియదు. ఆవిడ ఉనికి నాకో చిక్కు వీడని ప్రశ్న అయింది. ఎలా ఆవిడ గురించి తెలుసుకోవడం అన్న ఆలోచన నా మెదడులో నిరంతరం సుడులు తిరుగుతూనే ఉంది. జీవితం విచిత్రంగా ఎప్పుడూ, ఎవరికోసం ఆగదు. నా దైనందిక కార్యక్రమాలన్నీ నా అంతరంగంలో రేగుతున్న ప్రశ్నల గురించి అంత పట్టించుకోకుండా సాగిపోతునే ఉన్నాయి. నాన్నగారు నా పేరున పెట్టిన వ్యాపారాలన్నీ అన్నయ్య కిచ్చేశాను. ఆయన ఎన్ని నష్టాలొచ్చినా అమ్మకుండా భద్రంగా కాపాడిన ప్రింటింగ్ ప్రెస్ మాత్రం నేను ఉంచుకొన్నాను. స్మశాన వైరాగ్యం చావుకి దగ్గరలో ఉన్న వాళ్ళకి వస్తుందంటారు, కానీ ఒక్కోసారి చావుని దగ్గరగా చూసిన వాళ్ళకీ వస్తుంది. డబ్బు, దక్షత, అధికారం ఇవన్నీ మనం పోయిన మరోక్షణమే ముక్కలుగా పగిలి దిక్కులు చెదిరి పోతాయని నాకు ప్రత్యక్షంగా అర్థమైంది. నాన్న నాకిచ్చిన ఫాం హౌస్ తప్ప నా పేరన ఉన్నవన్నీ అమ్మకూ, అన్నయ్యకు ఇచ్చేశాను. ఇంట్లోనుండి ఫాం హౌస్‌కి మారుతుంటే అమ్మ



గోల పెట్టింది, కానీ నాకు కొన్ని రోజుల ఒంటరితనం అత్యవసరం అనిపించింది.

పెండింగ్‌లో ఉన్న రచనలు, ఇతర వ్యవహారాలు చూసుకొని రచయితలు, రచయిత్రులతో మీటింగులతో బిజీగా ఉన్నాను ఆ మధ్యాహ్నం. ఏదో మీటింగ్‌కి కావాల్సిన ముఖ్యమైన కాగితాల కోసం లాకర్ లోపల వెతుకుతుంటే చేతికి తగిలింది, ఆ కాగితాలన్నింటి వెనుక ఉన్న ఒక చిన్న పెట్టె. ఆత్రుతగా తెరిచి చూశాను. శాటిన్ అండర్ లైనింగ్ ఉన్న ఆ పెట్టెలో ఒక చిన్న కాగితం మడతలు పెట్టి, పైన 'కావేరికి' అని నాన్నగారి చేతివ్రాతలో రాసి ఉంది. వణుకుతున్న చేతులతో విప్పి చూశాను. లోపల ఎవరిదో ఫోను నంబరు వేసి ఉంది. జరగబోతున్న మీటింగ్ రద్దు చేయమని సెక్రటరీకి చెప్పి, నా రూం తలుపు వేసుకొని నంబరు డయలు చేశాను. కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత అవతల వైపు ఫోను మ్రోగడం వినిపించింది. నాలుగు రింగులు వచ్చినా ఎవరూ తీయలేదు. మొదటిసారి జైంట్‌వీలు ఎక్కినప్పటి అనుభూతి ఒంటి నిండా అలుముకొంది. అంతలో ఎవరిదో స్త్రీ కంఠం మృదువుగా "హల్లో" అని వినపడింది.

"హల్లో.." తిరిగి అన్నాను. అంతకంటే ఏం చెప్పాలో తోచక.

"ఎవరు మాట్లాడేది?" ఆమె కంఠం ప్రశ్నార్థకంగా.

"నా పేరు కావేరి. ఆనంద్ గారి అమ్మా..."

"ఇన్ని రోజులు పట్టిందా ఆ కాగితం కనపడ్డానికి?", నా మాటలు సగంలో ఆపుచేస్తూ, నేనెవరో పరిచితురాలైనట్లు ప్రశ్నించింది.

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యం మిళితమైన స్వరంతో అడిగాను.

"ఆయన జీవితంలో ఒకే ఒక్కరికి తనెవరో, ఏమిటో తెలియాలని కోరుకున్నారు. తెలియ జెప్పే బాధ్యత నాకు అప్పగించారు. నువ్వు ఆయన ఆశించినట్లుగా కనుక్కోవడానికి ప్రయత్నం చేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంది."

"అసలు మీరెవరు? నాన్నగారి గురించి మీకింతగా ఎలా తెలుసు, మీ పేరేమిటి?"

"నన్ను బస్టాపులో గుర్తించావు కదా. నీ ఫోను కోసం ఇన్ని రోజులుగా చూసి, మీ నాన్నగారు ఊహించినట్లుగా అసలు నీకేమైనా ఆసక్తి ఉందా అని గమనించ దల్చుకున్నాను. నేననుకొన్నట్లుగా నన్ను గుర్తుపట్టిన భావం నీ మొహంలో మొదటి రోజే చూశాను. కానీ ఎక్కడ చూశావో నీకు గుర్తు రాలేదు. వారం రోజుల తర్వాత కూడా నీకు జ్ఞాపకం వచ్చిన సూచనలు కనపడలేదు. ఆ రోజున నన్ను గుర్తు పట్టగలిగే ఏకైక వ్యక్తి నీతో పాటు మెట్లు దిగి వస్తు కనపడ్డాడు. మీ అందరి జీవితాల్లోనూ అంత వరకూ లేని అధ్యాయం అతను నన్ను గుర్తించడంవల్ల మొదలవడం ఇష్టం లేక ఆ రోజు నుండి కనిపించడం మానేశాను. ఏదో ఓ రోజు ఆ పేపరు చూసి ఫోను చేస్తావని ఎదురు చూస్తున్నాను."

"చెప్పండి ఏం మాట్లాడాలి నాతో? ఏం చెప్పమన్నారు నాన్న?"

"ఇవ్వాళ సాయంత్రం నువ్వు రోజూ వచ్చే టైముకి బీచ్‌కి వస్తాను. అప్పుడు నీకందచేయవలసినవి ఇస్తాను. ఉంటాను." ఫోను పెట్టేసిందావిడ.

సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న నాకు కాలం స్థంభించినట్లుగా అనిపిస్తోంది. అమాంతంగా వెళ్ళి గోడమీది గడియారంలో గంటల ముళ్ళుని తిప్పేస్తే బావుండనిపిస్తోంది. ఎలాగో ముళ్ళమీద కూచున్నట్లు ఆ కొన్ని గంటల కాలం గడిచింది. డ్రయివరును ఇంటికి వెళ్ళమని చెప్పి, టెన్నిస్ క్లబ్ నుండి శరవేగంతో కారు డ్రయివ్ చేసి బీచ్‌లో వాలాను... నేను చుట్టూ చూస్తూ నడుస్తుండగా ఇసుకలో కూచున్న ఆవిడ నన్ను చూసి నవ్వుతూ చేయి ఊపింది. వెళ్ళి దగ్గరగా నేనూ కూచున్నాను. "మరిక ప్రశ్నలేం అడగనవసరం లేదు. అన్నింటికీ సమాధానాలు ఈ పేజీల్లో ఉన్నాయి." అంటూ డైరీలోంచి చింపినట్లుగా ఉన్న పేజీలనందించింది.

ఆమె చేతుల్లోంచి లాక్కున్నట్టుగా తీసుకొని ఒక్కొక్క పేజీ చదవడం ప్రారంభించాను. "కాలం గాయాల్ని మాన్పుతుందని ఎవరన్నారు? ఆ సంఘటనలన్నీ నిన్న జరిగినట్లుగా ఇన్నాళ్ళయినా నా కళ్ళముందు ఇప్పటికీ సజీవంగా మెదులుతూనే ఉంటాయి. ఎవరో ముఠానాయకుణ్ణి ఈ కులం

వాళ్ళే చంపేశారంటూ ఆ నాయకుడి కులం వాళ్ళు మా వాడ మీద దాడి చేశారు. దొడ్డిలో స్నానం చేస్తున్న అమ్మను, "ఒరే, శివుడూ, నేనురా ఎందు కింత అన్యాయం చేస్తున్నావు?"



ఆశగా చిన్ననాటి స్నేహితుడికి చివరి క్షణంలోనైనా మనసు మారతుందేమోనన్న అర్థిస్తున్న నాన్ననూ దారుణంగా హత్య చేయడం నాకు బాగా గుర్తు. ప్రాణాలుగ్గబట్టుకొని వడ్ల బస్తాల వెనుక దాక్కున్న ఆ దుర్భరక్షణాల్లో అనుభవించిన వ్యధ మళ్ళీ జీవితంలో తిరిగి ఎన్నిసార్లనుభవించానో ఎవరికీ తెలీదు. మానసిక గాయాలు పాతబడడం అంటూ ఉండదు. బంధువులతో, పిల్లా పాపలతో కొద్దినిమిషాల క్రితం కళకళలాడిన వాడ మొత్తం మృత్యువు స్వైరవిహారం చేసిన కదన రంగమైంది. తొమ్మిదేళ్ళ వయసులో అలాంటి ఘోరాన్ని చూసిన ఏ పసిప్రాణానికి మానవత్వమంటే నమ్మకం మిగులుతుంది? విచిత్రంగా నాకు మాత్రం ఎవరి మీదైనా కసి తీర్చుకుందామన్న ఆలోచనే రాలేదు. ఇన్ని అద్భుతాలు సాధించినా, ఆ పొరలన్నింటి వెనుకా ఉన్నది ఓ మృగమేనని అర్థమైన నాకు మనిషి మీద ఎందుకో కేవలం హేయమైన అభిప్రాయం మాత్రమే మిగిలింది."

"పరంధామయ్యగారే లేకపోయుంటే నా జీవితమేమై ఉండేదో ఊహించుకోడానికే భయమేస్తుంది. భార్య పోయినా కూతురి కోసమని మరో పెళ్ళి చేసుకోకుండా, తల్లీ తండ్రీ తనే అయి పెంచుకుంటూ కష్టాలు పడుతున్న ఆయన నన్ను చేర దీసి చదువు చెప్పించారు కనీసం నాకు అలాంటి మనిషి పరిచయమైనా అయింది. అదిలేక దిక్కుమాలిన లోకంలో బిక్కు బిక్కుమని బ్రతికే బాలలెంతమందో. ఆయనవల్ల దయ, కరుణ వంటి మాటలకు అర్థాలు కూడా ఉంటాయని తెలిసింది. అలాంటి మనిషి చివరి కోరికగా తన కూతురుని పెళ్ళి చేసుకోమని అర్థిస్తే ఏం చెప్పగల్ను? కానీ ఆ నిర్ణయం నాకూ, మాలతికి ఇద్దరికీ శాపంగా పరిణమిస్తుందని ఆనాడూ నేనూహించలేక పోయాను. ఎప్పుడూ హాస్టల్లో ఉండి చదువుకున్న నాకు మాలతి స్వభావం గురించి అంతగా తెలీదు. తెలిసే సరికి మా ఇద్దరి మధ్యకి మరో రెండు ప్రాణాలు వచ్చాయి. సృష్టిలో ఇద్దరు మనుషులు ఎంత భిన్నంగా ఉండొచ్చు అన్న దానికి అనవసరమని తెలీడానికి ఎక్కువ కాలం పట్టలేదు. బావిలో కప్ప తన ప్రపంచం అదే అనుకొంటే, మాలతి లాంటి కప్పలకి తను కూచున్న తామరాకే ప్రపంచం. అలాంటి వాళ్ళని మార్చగలననుకోవడం పెద్ద తప్పు."

"జీవితాన్నుండి తప్పించుకోడానికి వ్యాపారమ్మీద శ్రద్ధ వహించాను. బుర్ర ఉపయోగించడం సరిగ్గా తెలిస్తే ఏదైనా సాధించడం చాలా తేలిక అని త్వరలో నిరూపించాను. సంఘంలో అందరికీ ఇప్పుడు నేనంటే గౌరవం. నా కుటుంబానికి అక్కరలేనంత ప్రతిష్ఠ, వీటన్నింటి మధ్యా మాలతి ప్రపంచం చింతనలేని దీవి, నాకేమో వెలుగన్నది కనిపించని స్వరంగ మార్గం. వీటన్నింటి కర్థం ఏమిటి? డబ్బుతో పాటు చుట్టూ చేరి ముఖస్తుతి చేసే వాళ్ళు ఎక్కువయ్యారు... మనుషుల స్వభావాల అసలు రంగులు తెలిసిన నాకు ఏనాడు ఎవరితోనైనా మాట్లాడ్డానికి ఇష్టముండేది కాదు. వాళ్ళు నోరు తెరిస్తే వచ్చేవి అబద్ధాలు. వారిలో కొందరి జీవితాలే షేక్స్‌పియర్

అన్నట్లుగా వేషధారణలు. వాళ్ళతో మాట్లాడి సమయం వృధా చేయడ మనవసరం."

" నోరు విప్పి మాట్లాడవేం, నీకూ మీ నాన్నలాగే మాట్లాడితే ముత్యాలు రాలతాయని భయమా? " కావేరిని మాలతి కేకలేస్తుంటే చూశాను. అవును, కావేరి నా కూతురు, కార్తీక్ మాలతి కొడుకు అంటారందరూ. రూ(నానూ కావేరిలో నా పోలికలే కాదు, స్వభావం కూడా కనపడుతుంది. అలా అనుకున్నప్పుడు ఓ క్షణం సంతోషమేసినా నాలాంటి జీవితం కావేరికి వద్దని మనఃస్ఫూర్తిగా కోరుకుంటాను."

"ఈ ప్రపంచంలో ఎవరికైనా నా మనసులో, మదిలో ఏముందో తెలుసు అంటే, ఒకటి ఈ పుస్తకానికి, రెండు నా గులాబీ పొదలకి..."

"ఆడపిల్లలు ఎంత తొందరగా పెద్దవాళ్ళవుతారు? కావేరి కాలేజ్‌లో జాయనయింది. ఎంత అందంగా పెయింట్ చేస్తుంది, అంతకంటే అందంగానూ రాస్తుంది. నాకు ఒక్కోసారి గర్వంగా అనిపిస్తుంది తనకి తండ్రి కాగలగడం. కావేరికి ఏనాడైనా తెలుస్తుందా తన మీద నాకు ఇంత ప్రేముందని?"

"నిన్న శరణార్థుల శిబిరంలో సహాయం చేయడానికి వచ్చిన నాకు అనుకోకుండా ఒక మహత్తరమైన వ్యక్తి పరిచయమైంది. ఆత్మవిశ్వాసానికి మానవతా విలువలు రంగరించి, ఆ మూర్తికి ప్రాణం పోస్తే ఆమె శారద అవుతుంది. శతాబ్దాల తరబడి తమ పూర్వీకులు నివసించిన ప్రాంతాల్ని వదిలి, ప్రాణాలు నిలబెట్టుకొనే ప్రయత్నంలో దేశాంతరాలు తరలి వచ్చిన వాళ్ళందరి బాధలు తనవిగా భావిస్తూ, అందులో ప్రతి ఒక్కరి జీవితం ఎంత విలువైందో వాళ్ళకి తెలియజెబుతూ తిరుగుతున్న తనని చూస్తే ఎన్నో ఏళ్ళ నుండి నేనెదురు చూస్తున్న భావమేదో హఠాత్తుగా కళ్ళకు కరి మబ్బుగా పట్టి, గుండెలో వెలుగు వానై కురిసింది. కేవలం మాలతి లాంటి కప్పలే కాదు, నాలాంటి కప్పలకి తెలిసిందీ తక్కువేనని అర్థమైంది."

"సృష్టిలో ప్రతి ఒక్కరికీ సరిగ్గా సరిపోయే జోడీని దేవుడు సృష్టిస్తాడని ఎవరేనా అంటే నా మనసులో వారి పిచ్చికి నవ్వుకొనే నా అజ్ఞానాన్ని ఇవ్వాళ పటాపంచలు చేసింది శారద. ఇన్నాళ్ళూ తనంటూ ఉందని తెలీని ప్రపంచంలో నేనెలా మనగలిగాను? అసలు ఇద్దరు మనుషులు ఇంత దగ్గరగా, ఇన్ని విషయాల గురించి ఒకేలా ఆలోచించగలగటం ఎలా సంభవం? ఆమె కళ్ళనీ, ఆ కళ్ళలో నవ్వునీ తలుచుకొంటే ఎవరో నొక్కి పట్టినట్లుగా ఊపిరి అందనట్లుగా ఉందే? ఆమె పేరు తల్చుకుంటే గుండె ఎందుకిలా బలహీనమౌతుంది? ప్రేమంటే ఇదేనా? ఇదే ఐతే ఈ వయసులో ప్రేమలో పడ్డం ఎంత హాస్యాస్పదం? అన్ని విషయాల్లోనూ అంత నిబద్ధత చూపించే నేను ఎందుకిలా అవుతున్నాను?"

"ఇంత ఆనందంగా ఉండడం ఏ మనిషికైనా సాధ్యమేనా? శారద కళ్ళెత్తి చూస్తే నా మోకాళ్ళు శరీరాన్ని మోయలేనట్లు వణికిపోతున్నాయి. అమాంతంగా తనను కౌగలించుకొని నాలో కలిపేసుకోవాలన్న పిచ్చి కోరిక నన్ను నిలువెత్తునా దహిస్తోంది. ఎందుకు, ఎందుకిలా ఇప్పుడు పరిచయమైంది నాకు? నా ఊహల్నీ, కలల్నీ చదివేసినట్లు ఎందుకలా రహస్యంగా పెదవుల మాటున నవ్వుకొంటుంది?"

"ఆనంద్ బాబూ, ఇలా ఎన్నాళ్ళిలా ఈ బాధ అనుభవిస్తావు? నిన్న వాలంటీరు క్యాంపులో అందరూ వెళ్ళిపోయాక నా కళ్ళలో సూటిగా చూస్తూ అడిగింది. ఏం చెప్పగలను? ఎవరికైనా ఏదైనా నేనెప్పుడు చెప్పగలిగాను? టేబుల్ చుట్టూ తిరిగి వచ్చి కుర్చీ చేతిమీద కూచొని తల వంచి నా పెదవులపైన సున్నితంగా ముద్దు పెట్టుకొంది. ఆక్షణం కొన్ని వేల సన్న జాజుల పరిమళం, ఏటి పరవళ్ళ మధ్య లేచే మంచు తెరల్లో కరిగి పోయి, వెన్నెట్లో నవ్వుతున్న పున్నాగపూల పుప్పొడి రాగాలకి వంత పాడింది. ఈ క్షణం నేను చావుకైనా సిద్ధమే. ఇన్నాళ్ళూ ఏ అస్థిత్వానికి అర్థం కోసం వెతుకులాడానో, ఆ అస్థిత్వం ఈ క్షణం వరకూ నాది కూడా కాదని తెలిసింది."

"శారదలాంటి వ్యక్తితో జీవితంలో కొన్ని రోజులు పంచుకోగలగడం నా అదృష్టం. సమాజం మా బంధాన్ని హర్షించదా, అయినా సమాజానితో నాకేం పని? ఇన్నాళ్ళూ మోడు పోయి, మూగ పోయిన నా జీవితం గురించి సమాజమేమైనా పట్టించుకుందా, ఇవ్వాళ వచ్చి నన్ను నిలదీయడానికి దానికేం హక్కు? ఒక పురుషుడూ, స్త్రీ పరిపూర్ణంగా ఒకరి నొకరుఅర్థం చేసుకోవడం అన్న పవిత్రమైన

విషయం కన్నా ఏ వ్యవస్థా గొప్పది కాదు చివరికి వివాహం కూడా. శారద నాలో జీవధారని వెలికితీస్తుంది."

చదవడం పూర్తి చేసి సన్నటి కన్నీటి పొర కళ్ళని కమ్మేస్తుండగా, ఆమెకెలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థంకాక ఆమె కేసి చూశాను. నువ్వేం చెప్పనవసరం లేదన్నట్లుగా చిన్నగా నవ్వి, నన్ను దగ్గరకు తీసుకొని నుదిటి మీద నెమ్మదిగా ముద్దు పెట్టుకొంది. ఇన్నాళ్ళూ మూత బడ్డ గుండె వాకిళ్ళ మాటున ఎక్కడిదో సన్నటి రాగం, బలవంతంగా వేళ్ళతో సహా పెకిలించుకొని భావాల క్రింద నుండి మధురంగా మొదలై, ఉన్నట్లుండి అమాంతంగా వేళ్ళతో సహా పెకిలించుకొని వెల్లువై ముంచెత్తింది. అవును కదూ, నాన్న లాంటి వ్యక్తినే అర్థం చేసుకోగల తనకి నేను చెప్పేందుకేం ఉంది?



2001 లో కంప్యూటర్ సైన్సులో ఎం.ఎస్. పూర్తిచేసిన వద్దనుంచీ సన్ మైక్రోసిస్టమ్స్‌లో ఉద్యోగం. చదవడం,వ్రాయడం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, హైకింగ్..హాబీలు..!